# ద్రోన్ టెక్నాలజీపై అవగాహన సదస్సు



రాయచోటి టౌన్ సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

రాయచోటి: శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్)లో మంగళవారం డ్రోన్ టెక్నాలజీ, స్వార్మ్ ఇంటెలిజెన్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డ్రోన్ టెక్నాలజీ వినియోగాలు, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుక్తి ఏఐ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సంజీవ్ పాల్గొని మాట్లాడుతూ, డ్రోన్ టెక్నాలజీ ప్రస్తుతం వ్యవసాయం, రక్షణ, విపత్తు నిర్వహణ, నిఘా, మ్యాపింగ్, సరుకు రవాణా, మౌలిక వసతుల పరిశీలన వంటి అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్ వంటి సాంకేతికతలతో డ్రోన్ల సామర్థ్యం మరింత పెరగనుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఈ. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ మాట్లాడుతూ, డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్‌లో అనేక కొత్త ఉద్యోగ, స్టార్టప్ అవకాశాలకు మార్గం చూపుతుందని అన్నారు.


ప్రభాత

కడప - అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 30 సెప్టెంబర్ 2026


## సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమీక్ష



రాయచోటి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

అక్టోబర్ 2న మదనపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన నేపథ్యంలో రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పర్యటనకు సంబంధించి శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలపై మంత్రులు అధికారులతో చర్చించారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుధ్యం తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఏర్పాటును క్షేత్రస్థాయిలో పరిశీలించి పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీఎం ప్రోగ్రామ్స్ కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్యతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు

## జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత



జమ్మలమడుగు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :

హార్టికల్చర్ హబ్‌గా జమ్మలమడుగు అభివృద్ధి రాయలసీమలో అభివృద్ధిలో జమ్మలమడుగు ప్రథమ స్థానం జిల్లా ఇన్చార్జిమంత్రి సవిత రాయలసీమలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా జమ్మలమడుగు నియోజక వర్గాన్ని అభివృద్ధి చెందుతుందని కడప జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రహదారిలో రిపబ్లిక్ క్లబ్ నందు శంకర్ రెడ్డి సుబ్బరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపుకు ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మెరుగైన రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ కాలువలు, నిరంతరం విద్యుత్ సరఫరా, ప్రతిరోజు నీటి సరఫరా, రైతులకు ఉచిత కరెంటు, చేనేతలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మరియు ఎన్టీఆర్ పెన్షన్లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందజేస్తున్నామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలు సైతం పట్టణ ప్రాంతాలకు ధీటుగా అన్ని రకాలుగా అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హాయాంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధికి ఈ ప్రాంతం నోచుకోలేదని ఇక వంద సంవత్సరాలైన వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాలేదని పేర్కొన్నారు. అనంతరం కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఇన్‌చారి భూపేష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్రంలో జమ్మలమడుగును అభివృద్ధిలో ప్రథమస్థానంలో నెలబెడేందు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ విధంగా గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వంలో చేయలేని అభివృద్ధిని కేవలం రెండున్నర సంవత్సరాలలో ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డిలు చేసి చూపించారన్నారు. . ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ రాజేష్ రెడ్డి, రమణా రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఆర్డిఓ శిరీష, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.ఎల్.నారాయణ రెడ్డి, అన్ని విభాగాల వైద్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయ నియామకాలపై ఆరోపణలు అవాస్తవం

అర్హత ఉన్నవారికే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:

2025డీఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో జరిగిన ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరిగిందన్న వైసీపీ ఆరోపణల్లో వాస్తవం లేదని కూటమి నాయకులు పేర్కొన్నారు. క్రీడా ప్రతిభ, నిబంధనల ప్రకారం అర్హత సాధించిన అభ్యర్థులకే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు లక్ష్యమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీకి చెందిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉద్యోగులు వి. లక్ష్మీపతి నాయక్, కట్ల రాముడిని మంత్రి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు ఉద్యోగం సాధించేందుకు చేసిన కృషి, క్రీడా రంగంలో సాధించిన అర్హతల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. స్పోర్ట్స్ కోటాలో తమకు ..మిగతా 2పేజీలో

## సీఎం, కేంద్రమంత్రి రాకతో పోలీసు

# యంత్రాంగం అప్రమత్తం

### అధికారులకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కీలక ఆదేశాలు



మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త.

గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న మదనపల్లెకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మరియు పలువురు ప్రముఖులు విచ్చేయనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం కొండామారిపల్లి హెలిప్యాడ్‌తో పాటు బీకే పల్లి కాలనీలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాలను క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. వీవీఐపీ కాన్వాయ్, రూట్ మ్యాప్‌లపై పోలీసు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రెవెన్యూ శాఖతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, డీఎస్పీ ఎం. బుచ్చిరాజు, ఇతర పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి గారూ! పల్లె పండుగ సరే!

### సూపర్ సిక్స్ హామీలలో మిగిలిపోయిన హామీల మాటేమిటి?

### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

పల్లె పండుగ సరే!మరి సూపర్ సిక్స్ హామీలలో మిగిలిపోయిన హామీల మాటేమిటి?అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. మంగళవారం తులసి రెడ్డి వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధాన కారణం అన్నారు. ఈ హామీలను నమ్మి ప్రజలు టిడిపి కూటమి పార్టీలకు ఓట్లు వేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చి 27 నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటికీ అందులో ప్రధానమైన హామీలు అమలు కావడం లేదని తులసి రెడ్డి అన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పడం జరిగింది.కానీ ఇప్పటివరకు ఈ హామీ అమలుకు నోచుకోలేదు. నిరుద్యోగులను నమ్మించి మోసగించడం భావ్యం కాదు. ఆడబిడ్డనిధి కింద 19 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని చెప్పడం జరిగింది . ఇప్పటివరకు అమలు కాలేదు.ఆడబిడ్డలను నమ్మించి మోసగించడం ఏమాత్రం భావ్యం కాదు. ఎస్సీ,ఎస్టీ, బీసీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే సామాజిక పెన్షన్ ఇస్తామని కూటమిపార్టీలు చెప్పడం జరిగింది . ఇప్పటివరకు అమలు కాలేదు.బడుగు బలహీనవర్గాలకు నమ్మించి మోసగించడం భావ్యం కాదని తులసి రెడ్డి అన్నారు. "ఏరు దాటినంతవరకు ఓడ మల్లన్న దాటాక బోడి మల్లన్న" అనే నైజాన్ని కూటమి ప్రభుత్వం ప్రదర్శించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది.ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరలో సూపర్ సిక్స్ హామీలలో పేర్కొన్న పై మూడు ..మిగతా 2పేజీలో

## వివేకా హత్య కేసులో ఈడీ

# విచారణ ముమ్మరం

### రెండో రోజూ ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డిలను ప్రశ్నించిన ఈడీ

### 2019 నాటి సమావేశంపై ఈడీ ఆరా

### నిఘా కెమెరాల దృశ్యాలపై ఉమాశంకర్‌రెడ్డిని ప్రశ్నించిన అధికారులు

పులివెందుల సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ రెండో రోజూ కొనసాగుతోంది. కేసులో నిందితులుగా ఉన్న ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 గజ్జల ఉమాశంకర్‌రెడ్డిని అధికారులు విడివిడిగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా 2019 మార్చి 15న ఎర్రగంగిరెడ్డి ఇంట్లో జరిగినట్లు పేర్కొంటున్న సమావేశానికి సంబంధించిన అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సమావేశానికి ఎవరు హాజరయ్యారు, అక్కడ జరిగిన చర్చలు ఏమిటి, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అలాగే వివేకానందరెడ్డి హత్య అనంతరం ఉమాశంకర్‌రెడ్డి గోడ దూకి వెళ్లినట్లు పేర్కొంటున్న దృశ్యాలకు సంబంధించిన నిఘా కెమెరాల రికార్డులపైనా అధికారులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో జరిగిన పరిణామాలు, అక్కడ ఉన్న వ్యక్తుల వివరాలు, అనంతరం జరిగిన చర్యలపై విచారణ సాగుతున్నట్లు సమాచారం. ఇటీవల ఆగస్టులో హైదరాబాద్, కడప ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నిర్వహించిన సోదాల్లో లభించిన పత్రాలు, ఇతర ఆధారాలకు సంబంధించి కూడా నిందితులను ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఈ విచారణలో సేకరించిన వివరాలను గతంలో నమోదైన వాంగ్మూలాలు, లభించిన ఆధారాలతో అధికారులు సరిపోల్చుతున్నట్లు సమాచారం. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరికొందరిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## వీఆర్వో లాగిన్‌తో రి సర్వే పూర్తి కాలేదు



వార్త 2వ పేజీలో

## స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి

# సమయత్తం కావాలి

### :జనసేన కడప పార్లమెంట్ కోఆర్డినేటర్ దేవ వరప్రసాద్




బద్వేలు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

త్వరలో జరగబోయే స్థానికల ఎన్నికల సమరానికి జనసేన నాయకులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ కడప పార్లమెంట్ కోఆర్డినేటర్ దేవ వరప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని రాఘవేంద్ర గ్రాండ్‌లో జనసేన పార్టీ ముఖ్య సమావేశం నిర్వహించారు. రాజోలు ఎమ్మె ల్యే, కడప రాజంపేట స్థానిక ఎన్నికల కోఆర్డినేటర్ దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. లోకల్ బాడీ ఎన్నికలపై స్థానిక నాయకులు, ఆశావహులు, సీనియర్ నాయకులతో అభిప్రాయ సేకరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కడప పులివెందుల కమలాపురం ప్రొద్దుటూరు మైదుకూరు లో స్థానిక మున్సిపాలిటీ ఎన్నికల కసరత్తు పర్యటన జరుగుతుంది అందులో భాగంగా ప్రస్తుతం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20 వార్డులలో జనసేన పోటీకి ఆశావహుల నుండి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రిజర్వేషన్లు, కూటమి సీట్ల సర్దుబాటుపై పార్టీ అధిష్టానంతో, కూటమి నాయకులతో చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు.ఈ కార్య క్రమంలో స్థానిక ఎన్నికల కడప పార్లమెంట్ కోఆర్డినేషన్ టీం జీవీ రమణ, మరియు పండ్రా రంజిత్ కుమార్ , స్టేట్ ఫుడ్ అండ్ సివిల్ సప్లై విజిలెన్సు కమిటీ సభ్యుడు తుడిమిళ్ళ మురళీ కృష్ణ, ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ , ఏఎంసీ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, నీటి సంగం చైర్మన్ సురేంద్ర, వైస్ చైర్మన్ డీవీ బద్వేల్ సీనియర్ నాయకులు నంద కిశోర్ ,ఈశ్వర్ రెడ్డి గోపవరం మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి మనోహర్ పోరుమామిళ్ళ నాయకులు కోటపాటి వెంకటేష్, వెంకట్రామ్, నగిరి రమణయ్య, ఇమ్రాన్ చంద్ర, మున్సిపాలిటీ నాయకులు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, నాగా ర్జున, తోట రాము, పెరుగు వెంకటయ్య, శ్రీనివాస్, గాజుల వంశి, వాయిలేటి శ్రీను, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసమే హార్టికల్చర్ హబ్

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

రాయలసీమ ప్రాంత రైతుల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మదనపల్లెలో రూ.లక్షకోట్లతో హార్టికల్చర్ హబ్‌ను ప్రారంభిస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన రైతులతో బెంగుళూరు రోడ్డులోని వ్యవసాయక్షేత్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 2న గాంధీజయంతిని పురష్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలసి హార్టికల్చర్ హబ్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈ హార్టికల్చర్ హబ్‌తో రైతులకు అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. ప్రపంచస్థాయి ఉద్యానవన యూనివర్శిటిలతో పాటు రైతులకు మేలు చేకూర్చేందుకు పరిశోదన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఉద్యాన పంటల వల్ల కలిగే లాభాలను వివరిస్తూ పంటల పెంపకంపై సూచనలు ఇస్తూ, ఉద్యానవన పంటల సాగుకు ఉపకరిస్తారని తెలిపారు. కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం పట్ల రైతులు కూటమి ప్రభుత్వాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ సిఎం సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు నెట్టం వెంకటేష్, అగ్రికల్చర్ ఏడి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఆర్.షంషీర్, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, ఆర్‌జె.వెంకటేష్, నాయకులు రంగప్ప, చిప్పిలి గురునాథ్, జీవి.నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు, శ్యామలమ్మ, రెడ్డప్ప, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మారనున్న గ్రామాల రూపు రేఖలు..!

### 11 వేల కోట్లతో పల్లె పండుగ 3.0 అభివృద్ధి పనులు.!!

### గంగమ్మ ఆలయ ఆర్చి నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి మండిపల్లి



గాలివీడు. సెప్టెంబర్ 29. ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నదని అందులో భాగంగా నిన్న 11 వేల కోట్లతో పల్లె పండుగ 3.0తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఆనందించదగ్గ విషయమని రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంతి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం గోరం చెరువు పంచాయతీ కుమ్మరపల్లికి సమీపంలో అసర్ల గంగమ్మ ఆలయ ఆర్చి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,700 కోట్లతో 6000 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7550 కోట్లతో 9500 కి.మీ. బీటీ రోడ్లు, 225 కోట్లతో 50,000 ఎకరాలలో ఉద్యానం పంటల సాగు, 300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, 110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లు, 200 కోట్లతో బస్సు షెల్టర్లు, పంచాయతీ భవనాలు, రచ్చబండలను ఏర్పాటు చేయడం జరగనున్నదని తెలిపారు. గత రెండు సంవత్సరాల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వాటిని పూర్తి చేయడం కూడా జరిగిందని తెలిపారు. గాలివీడు మండలంలో గత రెండు సంవత్సరాల కాలంలో దాదాపుగా 10 కోట్లకు పైన వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఎల్ ని నో ప్రభావంతో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని తద్వారా నీటి సమస్య ఉన్న గ్రామాలలో ప్రత్యేక బోర్లు మరియు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతున్నదని పేర్కొన్నారు. అనంతరం 50 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం నూలువీడు పంచాయతీ కొత్తపల్లి హరిజనవాడకు చెందిన ఒక బాలునికి వైద్య చికిత్సలకు గాను మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా 30 వేల రూపాయలు తన సొంత నిధులను బాలుని తల్లిదండ్రులకు అందజేశారు. మండల కేంద్రంలోని మూగజీవాల పశువుల సంత స్థలాన్ని, కూరగాయల సంత స్థలాన్ని పరిశీలించారు,అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరింప చేశాడు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు హేమ్ కుమార్ రెడ్డి, దాసరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆనందకుమార్,మాజీ లక్కిరెడ్డి పల్లె మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య,మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, పార్థసారధి రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వెంకట శివా రెడ్డి,మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ మహబూబ్ బాషా, టిడిపి నాయకులు గీదర ధర్మారెడ్డి, నాగేశ్వరరావు, మీటే నాయక్, డాక్టర్ రామచంద్ర రెడ్డి, ఉదయ్ కుమార్, మధు సూదన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు, గాలులతో

# నేలకొరిగిన అరటి పంట

### ఈ.కొత్తపల్లిలో 15 ఎకరాల్లో పంట నష్టం పరిశీలించిన ఉద్యాన శాస్త్రవేత్తలు



అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

పులివెందుల, సెప్టెంబర్ 30 ప్రభాత వార్త :

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వీచిన బలమైన గాలుల కారణంగా ఈ.కొత్తపల్లి గ్రామంలో దెబ్బతిన్న అరటి పంటను పులివెందులలోని భారత వ్యవసాయ పరిశోధనా మండలి డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన కళాశాలకు చెందిన ఉద్యాన శాస్త్రవేత్తలు పరిశీలించారు. గ్రామ పరిధిలో సుమారు 15 ఎకరాల్లో అరటి మొక్కలు నేలకొరిగినట్లు గుర్తించారు. పంట నష్టంపై రైతులతో మాట్లాడి వివరాలను సేకరించారు.అరటి పంటలో గెలలు వచ్చే సమయంలో మొక్కలు నేలకొరగకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయడం, కర్రలు లేదా ఇతర ఆధారాలతో మొక్కలకు బలమైన మద్దతు కల్పించడం వంటి పద్ధతులను పాటించాలని తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వచ్చే అవకాశాలు ఉన్నప్పుడు ముందుగానే పంట సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చని వివరించా రు.ఈ కార్యక్రమంలో పంటల వ్యాధి శాస్త్రవేత్త డాక్టర్ చిరంజీవి, డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి, డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ యశ్వంత్ తదితర ఉద్యాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అలాగే ఈ.కొత్తపల్లి గ్రామ ఉద్యాన సహాయకుడు ఇంతియాజ్, ఎర్రబల్లి గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలత పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రానికి జాతీయస్థాయిలో

# ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డు



మైదుకూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంటలోని వైయస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన స్కాచ్ అవార్డు లభించింది. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగంలో అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగిన 109వ జాతీయ స్కాచ్ సమ్మిట్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశ వ్యాప్తంగా వివిధ పారిశ్రామిక సంస్థలు, జిల్లా కలెక్టర్లు, కమిషనర్లు, విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత స్థాయి సంస్థలు పాల్గొన్న పోటీలో వైయస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం తన సేవలను ప్రాజెక్టు రూపంలో సమర్పించి తుది దశకు చేరుకుంది.కెవికె వనిపెంట సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం. బాలకృష్ణ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, రైతులకు అందించిన సేవలను ప్రాజెక్టుగా రూపొందించి తొలి దశలో సమర్పించారు. అనంతరం అంతర్జాల మాధ్యమం ద్వారా తదుపరి దశలో పాల్గొని, అన్ని దశల్లో ప్రతిభ కనబరిచి చివరకు జాతీయస్థాయిలో ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైంది.ఈ అవార్డు లభించడం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతు సోదరులకు గర్వ కారణమని కెవికె ప్రతినిధులు తెలిపారు. ఈ గుర్తింపు శాస్త్రవేత్తలకు మరింత ఉత్సాహాన్ని అందించడంతో పాటు, భవిష్యత్తులో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం మరింత పట్టుదలతో పనిచేసేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయాల ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ విజయ పద్మ న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని వైయస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంట, విశ్వవిద్యాలయం తరఫున స్వీకరించారు.కృషి విజ్ఞాన కేంద్రం సాధించిన ఈ జాతీయస్థాయి గుర్తింపు పట్ల విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు, ఉపకులపతి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని అత్యుత్తమ అవార్డులు సాధించే దిశగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

